క్లుప్తంగా

హ్యాండ్లూమ్ క్లస్టర్‌కు వినతి



కేంద్రమంత్రితో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం: ధర్మవరంలో హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్‌కు మంత్రి సత్యకుమార్ విన్నవించారు. 'చేనేత బతుకు ఛిద్రం' శీర్షిక పేరిట సాక్షిలో ప్రచురితమైన కథనానికి మంత్రి సత్యకుమార్ స్పందించారు. సోమవారం కేంద్ర చేనేత, జౌళి శాఖ మంత్రిని కలిసి లేఖతో పాటు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అందించి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు. రూ.30 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తున్న ధర్మవరం హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటులో 80 శాతం మేర నిధులు (రూ.24 కోట్లు) కేంద్రం భరిస్తే.. మిగిలిన 20 శాతం నిధులు (రూ.6కోట్ల)ను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని లేఖలో వివరించారు.

అల్లుగుండు సర్పంచ్ రాజీనామా

నల్లచెరువు: అల్లుగుండు పంచాయతీ సర్పంచ్ బీబీ జాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాన్ని సోమవారం డీపీఓ సమతకు అందజేశారు. రాజీనామాకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలి

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలు నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని తహసీల్దార్ స్వర్ణలత సూచించారు. సోమవారం మాల్యవంతం రెవెన్యూ గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఓబిరెడ్డితో కలిసి తహసీల్దార్ ఈ-పంట నమోదు అయిన పొలాలను తనిఖీ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులందరూ పంటల సాగు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న వారందరూ ఈ-కేవైసీ చేసుకోవాలని సూచించారు. అలా చేసిన వారికి మాత్రమే ఏదైనా విపత్తు సంభవిస్తే పరిహారం అందించేందుకు అర్హులవుతారన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఓ డాక్టర్ కె.ఎస్.లక్ష్మీనరసింహశర్మ, ఏఈఓ ఉపేంద్రరెడ్డి, బత్తలపల్లి, మాల్యవంతం వీఏఏలు హరిప్రియ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

లింగమ్మ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నేతలు, ప్రజా ప్రతినిధులు

బత్తలపల్లి: ధర్మవరం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి తల్లి గొల్లపల్లి లింగమ్మ మృతికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సంతాపం తెలిపారు. సోమవారం రామకృష్ణారెడ్డికి ఫోన్ చేసి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉండగా మండలంలోని నల్లబోయనపల్లిలో లింగమ్మ అంత్యక్రియలను కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు అంత్యక్రియల్లో పాల్గొని లింగమ్మ మృతదేహానికి నివాళులర్పించారు.

ఉమామహేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన స్వాముల విగ్రహాలు

నల్లమాడ: రాగానిపల్లిలో నూతనంగా నిర్మించిన శివాలయంలో సోమవారం ఉమామహేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో మంగళవాయిద్యాలు, మంత్రోచ్చారణల నడుమ యాగం నిర్వహించి గర్భగుడి గోపురంపై కలశధారణ చేశారు. అనంతరం గర్భగుడిలో గణపతి సమేత ఉమామహేశ్వరుల విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం ఏర్పాటు

అమడగూరు: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల ఐక్యతా సంఘాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా మమత, ఉపాధ్యక్షులుగా భాస్కర్, కోశాధికారిగా చంద్ర, కార్యదర్శిగా రామలింగారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సునియా, నరేంద్ర, శ్రీనివాసులు, జానకిని ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు పేర్కొన్నారు. అనంతరం నూతన సంఘం తీర్మానాన్ని ఎంపీడీఓ మునెప్పకు అందజేశారు.

నేడు మండల సమావేశం

తాడిమర్రి: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రంగారావు తెలిపారు.

యుద్ధం ఆపాలని శాంతి ర్యాలీ

ముదిగుబ్బ: పాలస్తీనాపై ఇజ్రాయెల్ యుద్ధం ఆపాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని కరెంట్ ఆఫీస్ నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆటో పెద్దన్న, నరసింహులు, బాబ్జాన్, వెంకటేష్, పోతులయ్య, బాబు, పక్రుద్దీన్, నౌషాద్, రఫీ, రహీం, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

మురుగుకు రహదారి

- డ్రెయినేజీలు లేవు
- ఇళ్ల ముందు, రోడ్లపైనే మురుగు, వర్షపునీరు
- ఓ వైపు కంపు.. మరోవైపు దోమల మోత..





నల్లమాడ ఎస్సీ కాలనీలో రోడ్లపై పారుతున్న మురుగునీరు

నల్లమాడ: మండల కేంద్రం నల్లమాడలోని ఎస్సీ కాలనీ వాసులను డ్రెయినేజీ సమస్య పీడిస్తోంది. రోడ్లపైన, నివాసాల వద్ద మురుగు, వర్షపునీరు రోజుల తరబడి నిలిచి రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. కాలనీలో 200 కుటుంబాలు, 600కు పైగా జనాభా ఉంది. ఉత్తర దిశన కింది భాగంలో ఎస్సీ కాలనీ ఉంది. వీధుల్లో సీసీ రోడ్లు వేసినప్పటికీ దశాబ్దాలు గడుస్తున్నా డ్రెయినేజీలు మాత్రం ఏర్పాటు చేయలేదు. వర్షం వస్తే ప్రధాన రహదారి సత్యమ్మ కూడలి, కుమ్మరి వీధి, రామాలయం వీధుల పైభాగం నుంచి వర్షపు నీరు ఎస్సీ కాలనీలోకి ప్రవేశిస్తోంది. వర్షం ఆగిపోయినా పైభాగంలోని నివాసగృహాల వారు వృథా నీటిని రోడ్లపైకి వదులుతుండడంతో అది కాస్తా ఎస్సీ కాలనీలోని సిమెంట్ రోడ్లపై, నివాస గృహాల మీదుగా సమీపంలోని కుంటలోకి చేరుతోంది. రోడ్లపై అక్కడక్కడా ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు నిల్వ ఉండి రోజులు గడిచేకొద్దీ కంపు కొడుతోందని, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేతులు, కాళ్లు విరిగిన వారెందరో..

ఎస్సీ కాలనీలోని సిమెంట్ రోడ్లపై రోజుల తరబడి నీరు పారుతుండటంతో పాచిపట్టాయి. ఈ రోడ్లపై రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడటంతో పలువురికి కాళ్లు, చేతులు విరిగిన ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వాలు, అధికారులు మారినా తమ సమస్య తీరడం లేదని కాలనీ వాసులు నిట్టూరుస్తున్నారు.

సమస్యను పరిష్కరించే వారేరీ?



ఎస్సీ కాలనీలో మురుగునీటి సమస్యను గతంలో ఎంతోమంది నాయకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు కాలనీకి వచ్చి పరిస్థితిని స్వయంగా చూసి వెళ్లారు. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వర్షాకాలంలో సమస్య తీవ్రంగా ఉంటోంది. దోమలు అధికమై రోగాలబారిన పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

–రవీంద్ర, స్థానికుడు

డ్రైనేజీలు నిర్మించాలి



కాలనీలో డ్రెయినేజీలు నిర్మించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలి. మురుగునీరు ఇళ్లముందుకు రాకుండా మట్టితో అడ్డు వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కడా పడిపోతామోనన్న భయంతో రోడ్లపై భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. అధికారులు, నాయకులు స్పందించాలి.

– లక్ష్మీనారాయణ, స్థానికుడు

మూడు గ్రామాల్లో దాహం కేకలు

- నీళ్లపై నెలల తరబడి నిర్లక్ష్యం
- క్యాన్ నీళ్లు రూ.20తో కొనుగోలు
- ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన
- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై మండిపాటు



బాపనకుంట ఎస్సీ కాలనీ వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు తదితరులు

నల్లమాడ: మండలంలోని మూడు గ్రామాల్లో దాహం కేకలు మిన్నంటాయి. సత్యసాయి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్ల వద్ద క్యాన్ నీటిని రూ.20తో కొనుగోలు చేస్తున్నారు. రోజురోజుకూ పరిస్థితి దుర్భరంగా మారడంతో బాపనకుంట, బాపనకుంట ఎస్సీ కాలనీ, నీరాలవంక తండా ప్రజలు సోమవారం నల్లమాడ - పాముదుర్తి రహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్డిపల్లి సమీపాన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణ పనులు చేస్తుండగా పలుచోట్ల తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసం కావడంతో పై గ్రామాలకు సత్యసాయి తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఐదు నెలలు అవుతున్నా రోడ్డు కాంట్రాక్టు ప్రతినిధులు పట్టించుకోలేదన్నారు. బాపనకుంట ఎస్సీ కాలనీలో తాగునీటికి, ఇతర అవసరాలకు ప్రైవేట్ ట్యాంకర్ల వద్ద రూ.20కు ఇరవై లీటర్ల క్యాన్ నీరు తెచ్చుకుంటున్నారన్నారు. పేదలు నీటిని కొనుగోలు చేయలేని స్థితిలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు లేకుండా వారు ఒక్క రోజైనా ఉండగలరా అని నిలదీశారు. విషయం తెలుసుకున్న రోడ్డు నిర్వాహకులు, పీఆర్వో సుధాకర్‌రెడ్డి హుటాహుటిన ఆందోళనకారుల వద్దకు చేరుకున్నారు. రోడ్డు నిర్మాణం వల్ల దెబ్బతిన్న పైప్‌లైన్లను తక్షణమే మరమ్మతు చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతు సంఘం నాయకులు రాజారెడ్డి, సి.వెంకటరమణ, రామచంద్ర, సుందర్‌రెడ్డి, ఎ.చెన్నారెడ్డి, రవీంద్రారెడ్డి, లక్ష్మీనాయక్, ఎస్సీ కాలనీవాసులు శ్రీరాములు, గంగులమ్మ, నాగమ్మ, గంగరత్న, గంగాదేవి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేపటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

కదిరి: మద్యం దుకాణాలకు దరఖాస్తుల గడువు బుధవారంతో ముగియనుందని కదిరి ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఉప్పలపాటి వీరారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సర్కిల్ పరిధిలోని కదిరి టౌన్‌లో 8, తలుపుల మండలంలో 2, గాండ్లపెంట, ఎన్‌పీ కుంట మండలాల్లో ఒకొక్కటి చొప్పున మొత్తం 12 మద్యం దుకాణాలు ఉన్నాయని చెప్పారు. వీటన్నింటికీ కలిపి ఇప్పటి దాకా 31 దరఖాస్తులు అందాయని తెలిపారు. చివరి రెండు రోజుల్లో మరో 20 దాకా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఒకే వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా సమర్పించుకోవచ్చన్నారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించిందని, అయితే ఈ డబ్బు వాపసు ఇవ్వరు.. అనే విషయం దరఖాస్తుదారులు గుర్తుంచుకోవాలన్నారు.

మద్యం షాపులకు టెండర్లు వేసుకోండి

ధర్మవరం అర్బన్: మద్యం షాపులకు టెండర్లు వేసుకోవాలని ధర్మవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ చంద్రమణి కోరారు. సోమవారం ఆమె ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ధర్మవరం అర్బన్‌లో 10, రూరల్‌లో 2, బత్తలపల్లిలో 3, తాడిమర్రిలో 1, ముదిగుబ్బలో 4 చొప్పున మొత్తం 20 మద్యం దుకాణాలకు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో టెండర్లు వేసుకోవచ్చన్నారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్‌ఐలు నాగరాజు, చాంద్ బాషాలు పాల్గొన్నారు.

పేదలకు పట్టాలు ఇవ్వండి

నల్లమాడ: నల్లమాడ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 52లో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్‌లో పేదలకు పట్టాలు పంపిణీ చేసి, పక్కాగృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం డిప్యూటీ తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ పుట్టపర్తి నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చంద్ర, సీపీఐ మండల కార్యదర్శి వెంకటరమణ, నాయకులు గంగాధర్, నాగేంద్ర, ఆదిలక్ష్మి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు అందించాలి



ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కనగానపల్లి: రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సామాజిక పింఛన్లు అందించాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కదిరప్ప కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్‌దారులతో కలసి ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు పింఛన్లు ఇవ్వకుండా కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారన్నారు. ముఖ్యంగా మండలంలోని వేపకుంట, కోనాపురం, ముత్తువకుంట్ల, తదితర గ్రామాల్లో చాలా మందికి పింఛన్లు ఇవ్వకుండా అధికార పార్టీ నాయకులు అడ్డుపడుతున్నారని తెలిపారు. ఎస్సీ, ఎస్టీల్లోని పేదలకు కూడా అన్యాయం జరుగుతోందన్నారు. ప్రభుత్వ అధికారులు రాజకీయ తారతమ్య విబేధాలు లేకుండా అర్హులందరికీ పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పింఛన్‌దారులు వేపకుంట నారాయణ, రామచంద్ర, తదితరలు పాల్గొన్నారు.

ఓవర్ టైం డ్యూటీలు తగ్గించాలి

ధర్మవరం అర్బన్: ఓవర్ టైం డ్యూటీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కేబి నాగార్జునరెడ్డి, డిపో కార్యదర్శి ముస్తఫాల ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు రెండో రోజు సోమవారం ధర్మవరం డిపోలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఏ ఆర్టీసీ డిపోలోనూ లేని నిబంధనలు, ఓవర్ టైం డ్యూటీలు ధర్మవరం డిపోలో అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏడీసీలు మల్లికార్జున, టీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

కదిరి అర్బన్: ఇంటర్ చదువుతున్న తన కుమార్తె కనిపించడం లేదని మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల ఐదో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని పేర్కొంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మోహన్ తెలిపారు.

ఈఓపీఆర్డీగా మాధవరెడ్డి

ఎన్‌పీకుంట: మండల ఈఓపీఆర్డీగా ఎస్.మాధవరెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. బెళుగుప్ప నుంచి ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మనోహర్‌బాబు యల్లనూరుకు బదిలీ అయ్యారు.

ఏపీఎం గోపాల్ బాధ్యతల స్వీకరణ

నల్లమాడ: వెలుగు ఏపీఎంగా జి.గోపాల్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. అమడగూరు ఏపీఎంగా పనిచేస్తున్న ఈయన బదిలీపై నల్లమాడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఎం జయంతి తనకల్లుకు బదిలీ అయ్యారు.

కనగానపల్లి ఎస్‌ఐగా ఇసాక్ బాషా

కనగానపల్లి: కనగానపల్లి నూతన ఎస్‌ఐగా ఇషాక్ బాషా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి ఓడీసీకి బదిలీ అయ్యారు. వీఆర్‌లో బాషాను ఇక్కడికి నియమించినట్లు పోలీసులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

చిన్నారి కుటుంబానికి పరామర్శ

తాడిమర్రి: మోదుగులకుంట గ్రామంలో ఇటీవల ప్రహరీ కూలి డీలర్ మారక శివానందరెడ్డి కుమారుడు పార్థసారథిరెడ్డి (3) మృతి చెందాడు. సోమవారం చిన్నారి కుటుంబాన్ని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి పరామర్శించారు.

గుండెపోటుతో జనసేన నాయకుడి మృతి

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నానికి చెందిన జనసేన నాయకుడు పత్తి చలపతి (65) సోమవారం అనంతపురంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈయన జనసేన పార్టీ తరఫున 2019 ఎన్నికల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. పత్తి చలపతి మృతి పార్టీకి తీరని లోటని జనసేన నాయకులు పేర్కొన్నారు.

ఎంపీపీకి ఘన సన్మానం

తాడిమర్రి: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ రంగారావుతో పాటు సూపరింటెండెంట్ (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) నాగేంద్ర కుమార్, ఈఓపీఆర్డీ విజయ్‌శేఖర్‌నాయుడు తదితర అధికారులు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.

పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: అప్పరాచెరువు గ్రామంలో ఖరీఫ్‌లో వర్షాధారంగా రైతు బి.నాగన్న సాగు చేసిన ఆముదం పంటలో మండల సహాయ గణాంకాధికారి డాక్టర్ కె.ఎస్.లక్ష్మీనరసింహశర్మ ఆధ్వర్యంలో సోమవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. 6.5 కిలోల దిగుబడి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోండి

బత్తలపల్లి: దంపెట్ల పొలం సర్వేనంబర్ 288-2ఏలో మాల గంగప్పకు చెందిన 3.90 ఎకరాల భూమిని ఆక్రమించిన టీడీపీకి చెందిన పురుషోత్తం నాయుడుపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి డిమాండ్ చేస్తున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని సోమవారం తహసీల్దార్ స్వర్ణలత, ఎస్ఐ శ్రీనివాసులుకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సాకే హరి విలేకరులతో మాట్లాడుతూ గంగప్ప భూమిని పురుషోత్తం నాయుడు తన భార్య అశ్వర్థమ్మ పేరిట బోగస్ డీ పట్టా, నకిలీ పాస్ పుస్తకం సృష్టించుకుని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నాడన్నారు. నకిలీ పత్రాలని తహసీల్దార్ ధ్రువీకరించినా అశ్వర్థమ్మ పేరును ఆన్‌లైన్‌లో తొలగించకపోవడం అన్యాయమన్నారు. మరోవైపు తమ పెద్దల ఆస్తి తమకే చెందాలని మాల గంగప్ప కుటుంబ సభ్యులు అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు, సమత సైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు సూగమంచి శ్రీనివాసులు, జేఏసీ నాయకులు రామకృష్ణ, రాకేష్, రమేష్, బాధితులు నారాయణస్వామి, శ్రీరాములు, ఆసాదు హరి, ఆదినారాయణ, చౌడప్ప, గంగాధర్ పాల్గొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించాలి



వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్న అధికారులు

తలుపుల : వన్యప్రాణులను సంరక్షించాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ (ఎఫ్ఎస్ఓ) రామచంద్రారెడ్డి సూచించారు. సోమవారం మండలంలోని పెద్దన్నవారిపల్లి, ఎలగలబైలు సమీపంలోని అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహించారు. అడవుల్లోని ప్రాణుల సంరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని ఎఫ్ఎస్ఓ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్

ధర్మవరం: ధర్మవరం మున్సిపల్ కమిషనర్‌గా ప్రమోద్‌కుమార్ సోమవారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఉన్న కమిషనర్ మల్లికార్జున ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జమ్మలమడుగు కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను ధర్మవరం కమిషనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్మార్ట్ మీటర్లు వద్దు

చెన్నేకొత్తపల్లి: వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ఆలోచనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విరమించుకోవాలని సీపీఐ మండల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ సురేష్ కుమార్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహదేవ, నాగరాజు, ముత్యాలప్ప, రామాంజనేయులు, ముత్యాలప్ప పాల్గొన్నారు.

మందుబాబుల ఘర్షణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కౌసల్య బార్ వద్ద సోమవారం రాత్రి ఇద్దరు మందుబాబులు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో లోనికోటకు చెందిన నరేష్, మల్లాకాలువకు చెందిన నాగిరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఐకమత్యంగా జీవించాలి

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రజలందరూ ఐకమత్యంగా జీవించాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. సోమవారం రాత్రి మండలంలోని ఎం.చెర్లోపల్లిలో తమ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడారు.

ఉపాధి పనుల పరిశీలన

కదిరి అర్బన్: కె.బత్తలపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను సోమవారం ఎంపీడీఓ పోలప్ప పరిశీలించారు. పని ప్రదేశంలో కూలీలకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మస్టర్లను పరిశీలించారు. కూలీలకు ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కె.బ్రాహ్మణపల్లిలో లక్ష్మీదేవి అనే మహిళా రైతు పొలంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

చండీ మాతా నమోస్తుతే

దసరా దేవీ నవరాత్రులు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. ఐదోరోజు సోమవారం ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

– సాక్షి బృందం:



పుట్టపర్తిలో మహాచండీదేవిగా సత్తెమ్మ దేవత



తలుపులలో వెండి కవచ అలంకారంలో వాసవీమాత



ధర్మవరంలో భూవరాహస్వామి అలంకరణలో చెన్నకేశవస్వామి



పుట్టపర్తిలో అన్నపూర్ణదేవిగా రాజరాజేశ్వరి



కదిరిలో రాజరాజేశ్వరిగా మహాలక్ష్మి



కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో మోహినీ అలంకరణ



బత్తలపల్లిలో మహాచండీ దేవి రూపంలో లలితా త్రిపుర సుందరి



తాడిమర్రిలో లలితా త్రిపుర సుందరిగా వాసవీమాత



ముదిగుబ్బలో శివపార్వతుల అలంకరణలో వాసవీమాత

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

బత్తలపల్లి: మండలంలోని ప్రజా సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కమతం కాటమయ్య అధికారులను కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో, ఎంపీడీఓ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ స్వర్ణలత, నరసింహనాయుడును కలిసి మండలంలో నెలకొన్న సమస్యలను వారి ముందుంచారు. పలు గ్రామాల్లో శ్మశాన వాటికకు స్థలాలు లేవని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయించి, వారికి ఉచితంగా ఇసుకను సరఫరా చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు తదితర సమస్యలపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు రామకృష్ణ, నాయకులు సత్యప్ప, రామదాసు, జయమ్మ, పెద్దన్న, హమాలీ యూనియన్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.